'న్యూజెర్సీ' కథల పోటీలో 1000 రూపాయిల బహుమతి పొందిన కథ



# అస్తమించని సూర్యుడు!

**వేదుల శకుంతల**

తెలారా స్నానం చేసినట్టున్నాయి, తడి నేల మీదున్న పూల మొక్కలు. సాయంత్రపు నీరెండలో చల్లగా వీచే గాలితెరల్లో, అలఓకగా కదులుతున్న ఆ పూల మొక్కల్ని, ఆప్యాయంగా తడుముతూ - బక్కెట్టు లోనుంచి నీళ్ళు ముంచి మళ్ళీ మళ్ళీ ఒక్కొక్క మొక్కకి పోస్తున్నారు, ధనుంజయరావుగారు.

ప్రతి సాయంత్రం నాలుగు ఐదు గంటల మధ్యలో తప్పనిసరిగా చేసే కార్యక్రమం అదే! డెబ్బైఐదేళ్ళ ధనుంజయరావుగారు, - శరీర దృఢత్వంలో పట్టుసడలకపోయినా, మానసికంగా పండుటాకులా కంపించిపోతూ వుంటారు.

ఇంటి ముందు చిన్న పూదోట - చుట్టూ ప్రహరీగోడ - రెండు కొబ్బరి చెట్లు - నిమ్మ, జామల మధ్య కొన్ని కూర పాదులు వగైరాలతో అందమైన చిన్న డాబా ఇల్లు అది. ప్రభుత్వోద్యోగం చేసి బాగానే ఆర్జించి సొంత ఇల్లు అమర్చుకుని - రెండు వాటాలు అద్దెకి కూడా ఇచ్చేరు. ఇల్లు కట్టి - పాతికేళ్ళు దాటినా - కొత్త ఇల్లులా కళకళలాడుతూనే వుందంటే - అది, ధనుంజయరావుగారి సంరక్షణే తప్ప మరోటి కాదు.

ఒక్కగా నొక్క కొడుకు ప్రసాద్. వాడి కోసం అన్ని హంగులు అమర్చిపెట్టాలనే పితృవాత్సల్యం ఆయనలో పెల్లుబికి వుండేది. అందుకే ప్రసాదుకి విద్యాబుద్ధులు - పూర్తై ఉద్యోగం రాగానే వివాహం జరిపించేసి కోడలు వచ్చేసరికి సొంత ఇల్లు సిద్ధంగా వుంచారు. తమ సర్వీసంతా అద్దె ఇళ్ళల్లో గడిపినా రిటైర్ అయి కోడలు ఇంటికి వచ్చే వేళకి సొంత ఇల్లు అమరటం - పార్వతమ్మకి ఎంతో సంతోషం కలిగించింది.

పార్వతమ్మ నిండు కుండలాంటిది. కష్టమైనా, సుఖమైనా తొణికిసలాడదు. చిరునవ్వు వెనుక అన్నీ దాచేస్తుంది. నోరు మంచిదైతే, ఊరు మంచిది అనే సామెత బహుశా పార్వతమ్మ వల్లే - ప్రచారంలోకి వచ్చి వుంటుంది. తమ ఇంట్లో అద్దెకుండేవాళ్ళే కాదు, ఆ పక్కింటివాళ్ళూ, ఈ పక్కింటివాళ్ళు, పనిమనిషి, పాలమనిషి కూరగాయలవాళ్ళూ, అందరూ పార్వతమ్మంటే - 'ఆ పూజామందిరంలో నుంచి లేచి వచ్చిన అమ్మవారే' - అన్నంత భక్తిగౌరవాలు చూపిస్తారు. అయితే - ఇందరి అభిమానుల మధ్య, మమతానురాగాలు పంచుకున్నా హృదయాంతరాళంలో దాచుకున్న వ్యథ... అనుక్షణం ఆమెను సూదిలా గుచ్చుతూనే వుంది!

పండుటాకులా కంపించే ధనుంజయరావుగారూ, గుండెల్లో మండే గాయాన్ని భరిస్తున్న పార్వతమ్మగారూ, ఒకరినొకరు ఓదార్చుకుని - సానుభూతి జల్లుకుని, అనునయించుకోవటం - ఆ దంపతుల దినచర్యలో అంతర్భాగం!

ప్రసాదు - పద్మ చక్కగా పచ్చగా కాపురం చేస్తుంటే - మురిసిపోయారు, ధనుంజయరావుగారు. మళ్ళీ ఏటికి పండంటి మనమడు పుడితే ముద్దుమురిపాలతో తలమునకలైపోతుంది పార్వ

తమ్మ!

తాతయ్య బామ్మలై - ఇక ఇంతకన్నా కావల్సిం దేమీ లేదు అనుకున్నారు-.

కానీ - మనుమడు బుడిబుడి నడకలు నడిచే వేళ — కొడుకు వడివడిగా నడిచేస్తాడనుకోలేదు ధనుంజయరావుగారు.

"నాన్నా! నాకు బొంబాయిలో మంచి కంపెనీలో జాబు వచ్చింది. వచ్చే వారంలోనే జాయిన్ అవాలి. తర్వాత నెలలో వాళ్ళు ఫ్లాట్ అదీ ఇచ్చేక పద్మని, చైతన్యని తీసుకెళతాను" అని ఓ రోజు సాయంత్రం ప్రసాద్ పిడుగుపాటులా అన్నాడు.

మొదట ధనుంజయరావుగారికి ఏదీ అర్థంగా లేదు. ప్రసాద్ మళ్ళీ విడమరచి చెప్పాక తనకి చెవులేమిటో దిబ్బెళ్ళు పడుతున్నట్టు అనిపించింది. మరికొంచెం సేపటికి ప్రసాద్ ఇంకా చెపుతున్న ధోరణికి కొద్దిగా తేరుకుని - "అదేమిట్రా? ఇప్పుడు ఈ ఉద్యోగానికేమైంది? మరొకటి ఎందుకు? అసలు ఎందుకు అప్లై చేసేవు?" అనగలిగేరు.

"అదేమిటి నాన్నా? మంచి అవకాశం వస్తే అప్లై చేయవద్దూ? నీకు చెబుదామనుకున్నా. మరచిపోయాను" తేలిగ్గా అనేసేడు ప్రసాద్.

"ఇప్పుడున్నది మాత్రం మంచిది కాదా?" నాలిక తడుపుకుంటూ అడిగేరు.

"ఏమిటి నాన్నా? దీనికన్నా రెట్టింపు సంపాదించే ఉద్యోగం అది! మీరింకా సంతోషిస్తారనుకున్నాను" అన్నాడు చిన్నగా గొణిగినట్టు.

ధనుంజయరావుగారు చిన్నగా నిట్టూర్చి - "సంతోషమే! కానీ ఇప్పుడు మనకి ఉన్నది చాలదా? నేను కూడబెట్టినదంతా నీకు కాక మరెవరికి? దీన్నే రెట్టింపు చేసుకోవచ్చునుగదా?" అన్నారు.

"సంపాదించే సత్తా వుంది నాకు. ఉన్నదాన్ని బాగుచేసుకుని సంతృప్తిపడడం ఎందుకు? నేను వెళ్ళి జాయిన్ అవుతాను" అన్నాడు స్థిరంగా.

అన్న ప్రకారం ప్రసాద్ బొంబాయిలో కొత్త జాబులో చేరటం మళ్ళీ నెలలో పద్మని, చైతన్యని తీసుకెళ్ళిపోవడం తిరుగులేని విధంగా జరిగిపోయాయి!

ధనుంజయరావుగారు కొన్న ఫర్నిచర్‌లోనూ, ఇతరత్రా సామాన్లలోనూ కొద్దిపాటి మాత్రమే ప్రసాద్ బొంబాయి తీసుకునివెళ్ళాడు -

మిగిలినదంతా ఆ డాబా ఇంట్లోనే వుండిపోయింది!

ధనుంజయరావుగారూ, పార్వతమ్మ విలవిలలాడిపోయారు!!

నిలదొక్కుకుని, బోసిబోయిన ఇంట్లో బావురుమంటున్న మనసులతో బ్రతుకు బాటలో రాజీపడి సాగిపోవడానికి అలవాటుపడ్డారు.

అప్పుడప్పుడు ఎగదన్నుకుంటూ వచ్చే ఒంటరితనపు ఆవేదన - బలవంతంగా దిగమింగుకుంటూ - జీవితపు చివరి దశకు చేరుకున్నారు.

ఎప్పుడో చుట్టపుచూపుగా వచ్చిపోయే కోడలు, మనమడు - రాను రాను తగ్గించేయడంతో - నిర్వేదనతో ఓ నవ్వు నవ్వుకుని - 'పాపం! వాళ్ళకి తీరిక ఉండొద్దూ? మహానగరం కదా? పైగా చైతన్య చదువు పాడవదూ?' అని సమాధానపడ్డారు.

'అయినా ఇంకెన్నాళ్ళు? అస్తమించే సూర్యుడు ఆగుతాడా? విశ్వం అంతా తిరిగిన చైతన్య శక్తి రాత్రికి పరిసమాప్తి కావటంలేదూ? మనమెంత? ఎప్పుడో రాలిపోతాం! ప్చ్! ప్చ్! తాపత్రయపడి ఎన్నెన్ని కొన్నాం! ఇల్లంతా నింపేము. ఎందుకు ఇవన్నీ? ఎన్నెన్ని ఆశలు పడి కొన్నామో? అంతా వృథా! వాడేమైనా తీసుకెళ్ళాడా? ఎవరి బ్రతుకులు వాళ్ళవి! ఎవరి అవసరాలు వాళ్ళవి! వాళ్ళకి కావల్సినవి వాళ్ళే కొనుక్కుంటారు! మనం వెర్రివాళ్ళం పార్వతీ! వెర్రివాళ్ళం!!

అంటూ ధనుంజయరావుగారు కన్నుల్లో నీరు నింపుకుంటే ఆ కన్నులు చీరచెంగుతో తుడిచి - తన చెమ్మగిల్లిన కళ్ళతో - "బాధపడకండి. అబ్బాయి ఎప్పుడో ఇవన్నీ అమ్మేసి డబ్బు చేసుకుంటాడు. వృథా ఎందుకవుతుందీ?" అని ఓదార్చేది

"అవునులే" అని నిర్జీవంగా నవ్వే ధనుంజయరావుగారి కళ్ళలో ఓ ఊహాచిత్రం కదిలేది. సరిగ్గా పార్వతమ్మకీ ఆ ఊహే కదిలేది!

- తెలుగు ఇంటి జీవితం - ఓ వెలుగు నిచ్చే దీపంలా వివాహం, సంసారం, సంతానం, మనవలు, మనవరాళ్ళతో పచ్చగా విస్తరించుకున్న మహావృక్షంలాంటిది. అతిథి అభ్యాగతులకు బంధుమిత్రులకూ స్వాగతం పలుకుతూ - జీవితంలో పరమార్థాన్ని చూపే ఆలయంలాంటిది! పచ్చని గడప - నిండైన తోరణం - పిల్లల కేరింతలు - పెద్దల ఆశీస్సులు ఇవన్నీ తెలుగువారి వెలుగు వాకిట్లో పండే సిరిసంపదలు!! -

ఆటువంటి చిత్రాల్ని ఊహించుకుని, ఊపిరి పోసుకున్న ఆశలు - రెక్కలు తెగిన పక్షిలా నేల రాలినట్టు గిలగిలలాడుతున్నట్టున్న ఆ దంపతులకు ఆ సాయంత్రం ఓ మలుపు చూపి గొప్ప సత్యం తెలిపింది!

ఒక్కొక్క మొక్కకి జాగ్రత్తగా ఒత్తిగించి నీళ్ళు పోస్తూ 'మంచి పూలు పూయండి. రేపు గుళ్ళో పూజకి ఇస్తాను" - అంటూ నవ్వుకుంటున్నారు తనలో తను-

"తాతయ్యగారూ మీకు ఉత్తరం వచ్చింది" అంటూ రోడ్డు మీద ఆడుకుంటున్న కుర్రాడు ఓ కవరు పట్టుకువచ్చి ఇచ్చాడు. లేచి, చప్పున తడిచేతులు తుడుచుకుని కవరు అందుకుని చింపేరు.

అది ప్రసాద్ రాసింది - మామూలుగా ఎప్పుడూ రాసేదే - ఈసారి కొంత మార్పుతో వివరంగా వుంది - ఆత్రంగా చదివేరు - మళ్ళీ చదివేరు! మళ్ళీ మళ్ళీ!! -

అంతే! గబగబా ఇంట్లోకి వెళ్ళి పార్వతమ్మని పిలిచి విషయం చెప్పారు - ఆయన ముఖంలో ఓ కొత్త మార్పు వచ్చినా కళగానే వుంది!

"అయ్యో అలాగా?!! చైతన్య అమెరికా వెళ్ళిపోయాడా?! పాపం! మన ప్రసాద్ ఎంత బాధపడుతూ వ్రాసేడో?!" అంటూ పార్వతమ్మ బాధపడుతూవుంటే - "ఊరుకో బాధపడుతున్నాడా? దేనికీ? చైతన్యకి మంచి 'ఆఫర్' వచ్చిందిట మరి వెళ్ళడూ? బొంబాయిలోనే సరిపెట్టుకోమంటావా? అమెరికాలో మంచి భవిష్యత్తు వుంది వాడికి! అందుకే వెళ్ళివుంటాడు! ప్రసాద్ బాధ పడతాడా? మనమూ పడ్డాం గదా? కానీ - ఇంక నాకు బాధ లేదు! ఎందుకో తెలుసా? ఇది జీవితం! ఎప్పటికీ ఒకలాగే సాగదు. మార్పు సహజం! చూడు! సూర్యుడు ఉదయం తూర్పున వుంటే - సాయంత్రం పడమటికి రాలేదూ? మళ్ళీ రేపు ఉదయించడూ?

పార్వతీ! నాకిప్పుడు ఓ సత్యం తెలిసింది! అసలు సూర్యుడు అస్తమించడు! ఎందుకో తెలుసా? అమెరికాలో మన చైతన్యకి కనిపిస్తాడుగదా?! రేపు మళ్ళీ మనకి! ఇంక అస్తమయం ఏమిటి?? ఈ వసుధ అంతా ఒకే కుటుంబం!! ఇన్నాళ్ళు ఈ సంపాదన అంతా మనవళ్ళ కోసం అనుకున్నాను గానీ ... ఛఛ! రేపే వెళ్ళి అనాధ ఆశ్రమానికి హైస్కూలుకూ ఇచ్చేస్తాను. ఏమంటావు?" - అని ధనుంజయరావుగారు అడిగేసరికి - పార్వతమ్మ కళ్ళ నిండా వెలుగే నిండింది!

వరండాలో నుంచి ఇంకా అస్తమించని సూర్యుని కాంతి కళ్ళలో ప్రతిఫలించి - "నాది నాది" అనుకునే స్వార్థం నుంచి 'మనది' అనే సత్యాన్ని చూపించింది!!

## కాలేజీ చిత్రాలు

### "వేక్‌హర్ అప్"

మా యింగ్లీషు లెక్చరర్‌గారు అయ్యంగార్ తమిళుడు ఓ రోజు క్లాసులో యిద్దరు అమ్మాయిలు (బుచ్చి సిస్టర్స్) జోగుతున్నారు. అది చూచిన అయ్యంగారికి కోపం నషాళానికి అంటింది. ప్రక్కనున్న నాతో "వేక్‌హర్ అప్" అని పెద్దగా అరచాడు. ఆకేకకు పాపం ఆ యిద్దరు సిస్టర్స్‌కు మెలుకువ వచ్చింది. "ఏమ్మీ, క్లాస్‌లో తూంగుతూ ఉండారే. రాత్రి నిద్రలేదా వెంటనే పూడ్చి మూతి కడుక్కొని రాండేం" అన్నాడు. ఆయన తెలుగుకు ఆ సిస్టర్స్‌తో పాటు క్లాసంతా గొల్లుమంది.